తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ గురువారం 09 - 07 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజీలు : 4

# రసవత్తరంగా మోత్కూరు చేనేత సంఘం ఎన్నికలు

- ఎన్నికల్లో పోటీ చేస్తున్న మూడు ప్యానెళ్లు
- 9 డైరెక్టర్ స్థానాలకు 24 మంది పోటీ
- సంఘం పరిధిలో 207 మంది ఓటర్లు
- వంగరి రాములు ప్యానెల్‌కు పద్మశాలి సంఘం సపోర్ట్



ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు చేనేత సహకార సంఘం ఎన్నికలు రసవత్తరంగా జరుగుతున్నాయి. సంఘం పరిధిలో 9 డైరెక్టర్ స్థానాలు ఉండగా 7 జనరల్, రెండు స్థానాలకు మహిళలకు రిజర్వ్ అయ్యాయి. సంఘంలో 207 మంది ఓటర్లు ఉన్నారు. శుక్రవారం పోలింగ్ జరగనుండగా పోటీలో ఉన్న అభ్యర్థులు ముమ్మర ప్రచారం చేస్తున్నారు. ఎన్నికల్లో వంగరి రాములు ప్యానెల్, పాశికంటి లక్ష్మీనర్సయ్య ప్యానెల్, కూరపాటి రాములు ప్యానెల్ మొత్తం మూడు ప్యానెళ్లు పోటాపోటీగా తలపడుతున్నాయి. వంగరి రాములు, లక్ష్మీనర్సయ్య ప్యానెల్‌లో 9 డైరెక్టర్ స్థానాలకు పోటీ చేస్తుండగా, కూరపాటి రాములు ప్యానెల్ నుంచి ఆరుగురే పోటీలో ఉన్నారు. ఎనిమిదేండ్ల తర్వాత సంఘానికి ఎన్నికలు జరుగుతుండటంతో ఎన్నికల్లో గెలిచి చైర్మన్ పీఠం దక్కించుకోవడానికి చేనేత కార్మికుల్లో పట్టున్న నాయకులతో కలిసి వ్యూహాలు రచిస్తున్నారు. గత పాలకవర్గంలో ఉన్న నాయకుల పనితీరుపై, సంఘం మేనేజర్ వ్యవహార శైలిపై, సంఘంపై కొందరు నాయకులు చెలాయించిన ఆధిపత్య ధోరణిపై కార్మికుల్లో అసహనం, వ్యతిరేకత నెలకొన్నట్టు తెలిసింది. ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాల అమలు కోసం కార్మికుల నుంచి డబ్బులు వసూళ్లు, కార్మికులకు జరుగుతున్న అన్యాయంపై ఇటీవల పద్మశాలి సంఘం నాయకులు చేసిన పోరాటంతో జిల్లా అధికారులు విచారణ చేపట్టారు. సంఘం కార్యకలాపాలపై పారదర్శకత, కార్మికులకు ప్రభుత్వ పథకాలు ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా అందాలంటే మార్పు అవసరమని, కార్మికుల కోసం పనిచేసే నాయకులనే ఎన్నుకోవాలంటూ వారు ప్రచారం చేస్తున్నారు. పద్మశాలి సంఘం నాయకులు వంగరి రాములు ప్యానెల్‌కు మద్దతునిస్తూ ఇంటింటికి వెళ్లి కార్మికులను కలిసి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా ఆయా ప్యానెళ్ల అభ్యర్థులు, నాయకులు ఇప్పటికే ఓటర్లతో క్యాంపులు కూడా నిర్వహిస్తున్నట్టు తెలిసింది. 7 జనరల్ డైరెక్టర్ స్థానాలకు 18 మంది, రెండు మహిళా డైరెక్టర్ స్థానాలకు ఆరుగురు అభ్యర్థులు పోటీ పడుతున్నారు. 7 డైరెక్టర్ స్థానాలకు పోటీ చేస్తున్న అభ్యర్థులకు వైట్ బ్యాలెట్, రెండు మహిళా అభ్యర్థులకు లైట్ పింక్ బ్యాలెట్ ఉపయోగిస్తున్నారు. 207 మంది ఓటర్లు ఉండగా ఒక్కో ఓటరు ప్యానెల్‌లో ఉన్న 9 మంది అభ్యర్థులకు ఓటు వేయాల్సి ఉంటుంది. శుక్రవారం పోలింగ్ జరగనుండగా స్థానిక సహకార సంఘం కార్యాలయంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసి ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.



ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
గురువారం
జనరల్ న్యూస్
09 - 07 - 2026


# మోత్కూరు చేనేత సంఘం మేనేజర్‌కు నోటీసులు

- **అవినీతి, అక్రమాల ఆరోపణల నేపథ్యంలో నోటీసులు జారీ**
- **15 రోజుల్లో వివరణ ఇవ్వాలని జిల్లా అధికారుల ఆదేశాలు**

ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు చేనేత సహకార సంఘం మేనేజర్ వేముల నర్సయ్యకు చేనేత, జౌళిశాఖ యాదాద్రి జిల్లా ఏడీ శ్రీనివాస్‌రావు నోటీసులు జారీ చేసినట్టు తెలిసింది. మేనేజర్ నర్సయ్య సంఘంలో అవినీతి, అక్రమాలకు పాల్పడటంపై ఆయనపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఇటీవల విచారణకు ఆదేశించారు. జిల్లా అధికారులు మోత్కూరు వచ్చి చేనేత కార్మికులతో బహిరంగ విచారణ జరిపారు. ప్రభుత్వ పథకాల అమలుతో పాటు ఇతర సంక్షేమ పథకాల్లో లబ్ధిదారుల నుంచి మేనేజర్ నర్సయ్య డబ్బులు వసూలు చేసినట్టు పలువురు చేనేత కార్మికులు విచారణ అధికారులకు వాంగ్మూలం ఇచ్చారు. సంఘం ఆర్థిక లావాదేవీలు, కార్యకలాపాల్లో పారదర్శకత లేకపోవడం లాంటి ఆయన అవినీతి, అక్రమాలపై విచారణ చేసిన అధికారులు జిల్లా ఏడీకి నివేదిక సమర్పించారు. దీంతో మేనేజర్ నర్సయ్యకు అవినీతి, అక్రమాలు, వసూళ్లపై వివరణ కోరుతూ వారం రోజుల క్రితమే నోటీసులు జారీ చేసినట్టు సమాచారం. 15 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆశించగా, ఆయన ఇచ్చే వివరణ ఆధారంగా చర్యలు తీసుకోనున్నట్టు తెలిసింది.

# రజకుల ఉచిత విద్యుత్ బకాయిలు చెల్లించాలి




- బడ్జెట్‌లో కేటాయించిన నిధులను సంక్షేమానికి ఖర్చు చేయాలి
- రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డెబోయిన వెంకటేష్

ప్రజావారధి/మోత్కూరు

రజక వృత్తిదారులపై రూ.30 వేల నుంచి రూ.90 వేలకు పైగా ఉచిత విద్యుత్ బకాయిలు పేరుకపోయాయని, ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేసి బకాయిలు చెల్లించాలని రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి వడ్డెబోయిన వెంకటేష్ డిమాండ్ చేశారు. రజక వృత్తిదారుల కుటుంబ సర్వేలో భాగంగా బుధవారం మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌లో రజక వృత్తిదారుల సంక్షేమం కోసం వేల కోట్ల నిధులు కేటాయించి సంక్షేమం కోసం నిధులు మాత్రం ఖర్చు చేయడం లేదన్నారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో రజకులకు ప్రాధాన్యత ఇవ్వాలని, వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారికి మోపెడ్ వాహనాలు ఇవ్వాలని, 50 ఏళ్లకే వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రజకులు వృత్తి నిర్వహణలో భాగంగా అనేక ఆరోగ్య సమస్యలకు గురవుతున్నందున వారికి ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కొన్ని ప్రాంతాల్లో రజకుల ఇస్త్రీ షాపులపై దాడులు, తొలగింపులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కులం పేరుతో జరుగుతున్న వివక్షతను అరికట్టడానికి ప్రత్యేక రక్షణ చట్టం అమలు చేయాలని ప్రభుత్వాని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కూసంపల్లి సోమనర్సయ్య, బొడ్డుపల్లి మైసయ్య, బొడ్డుపల్లి లక్ష్మణ్, కూసంపల్లి ఉపేందర్, బొడ్డుపల్లి శివాజీ, కూసంపల్లి యాకయ్య, ఎలిమినేటి సంతోష్, అంజమ్మ, బి.చిన్నఫకీర్, బొడ్డుపల్లి సువర్ణ, పాశం లక్ష్మి, మంగమ్మ, కొండ్రాతి యాదయ్య, బి.బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# బాలిశెట్టిగూడెంలో విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ




ప్రజావారధి/శాలిగౌరారం

జిల్లా లయన్స్ క్లబ్ ఫాస్ట్ గవర్నర్ లయన్ మదన్ మోహన్ రేపాల పుట్టిన రోజు సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ శాలిగౌరారం ఆధ్వర్యంలో బుధవారం బాలిశెట్టిగూడెం ప్రాథమిక పాఠశాలలో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు పెన్నులు, నోట్‌బుక్స్, స్నాక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నిమ్మల ఆంజనేయులు, కోశాధికారి మురారిశెట్టి కరుణాకర్, జోన్ చైర్మన్ డెంకల సత్యనారాయణ, చార్టర్ ప్రెసిడెంట్ బుడిగె శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు దామర్ల శ్రీనివాస్, మార వేణుగోపాల్ రెడ్డి, రామడుగు వెంకటరామ శర్మ, జోగు శీనివాస్ , గుండ్ల రామ్మూర్తి, బట్ట చిన సైదులు, గుండు పరమేష్, పాఠశాల హెచ్‌ఎం చింతల శ్రీనివాస్, ఉపాధ్యాయురాలు చింతల రాజేశ్వరి, వార్డు మెంబర్ బట్ట యశోదశ్రీనివాస్ పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
09 - 07 - 2026

## ఆగస్టు 30 వరకు ఓటరు ఎన్యూమరేషన్ గడువు పొడిగించాలి



**ప్రజావారధి/మోత్కూరు**

రాష్ట్రంలో జరుగుతున్న "సర్" ఎన్యూమరేషన్ గడువును ఆగస్టు 30 వరకు పొడిగించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లు యాదగిరి కోరారు. మోత్కూర్ తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం జరిగిన బీఎల్ఏల సమావేశంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు జరుగుతున్నందున ప్రజలు ఈ ప్రక్రియపై దృష్టి సారించడం లేదన్నారు. ప్రస్తుతం ఓటరు జాబితాలో పేరు ఉన్నప్పటికీ 2002లో తమ పేరు ఉందా, లేదా అనే విషయంపై చాలా మందికి స్పష్టత లేదని, 24 సంవత్సరాల క్రితం తమ ఓటరు సంఖ్య, ఓటరు గుర్తింపు కార్డు సీరియల్ నెంబర్, పోలింగ్ స్టేషన్ వివరాలు తెలియక ప్రజలు అయోమయానికి గురివుతున్నారన్నారు. ప్రధానంగా బీఎల్వోలు ఇంటింటికి వెళ్లి 2002 ఓటర్ జాబితాలో పేరు ఉందా లేదా అనే విషయాన్ని ఓటర్లకు వివరించ కుండా కేవలం ఫారాలు ఇచ్చి వెళు తున్నారని, అవగాహన లేని ప్రజలు ఆ ఫారాలను ఎలా నింపాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రజలంతా తమ వివరాలను నమోదు చేసుకునెందుకు వీలుగా గ్రామస్థాయిలో పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, అపోహాలను తొలగించి " సర్ " ప్రక్రియ సరళతరం చేయాలని కోరారు. ప్రస్తుత పరిస్థితులను పరిగణలోకి తీసుకొని ఎన్యూమరేషన్ గడువును ఎన్నికల కమిషన్ మరో నెలరోజుల పాటు పొడిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, పట్టణ కార్యదర్శి రాచకొండ రాములమ్మ, మండల కమిటీ సభ్యులు దడిపల్లి ప్రభాకర్, పానుగుల రమేష్, గుండు లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 10న విద్యాసంస్థల బంద్




- **ఫీజులు నియంత్ర చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి**
- **ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతికుమార్**

**ప్రజావారధి/మోత్కూరు**

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 10న విద్యాసంస్థల బంద్ నిర్వహించనున్నామని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతికుమార్ తెలిపారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం మోత్కూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. స్కూళ్లు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నప్పటికీ సరైన మౌళిక వసతులు కల్పించాలని, మధ్యాహ్న భోజనం నాణ్యతగా పెట్టాలని, ప్రభుత్వ కాలేజీల్లో కూడా అమలు చేయాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నారని, దీంతో తల్లిదండ్రులు దోపిడీకి గురవుతున్నారన్నారు. మోత్కూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని, కబ్జాదారుల నుంచి కాలేజీ భూమిని కాపాడాలని కోరారు. మోత్కూరు బాలుర గురుకుల స్కూల్‌లో కామన్ డైట్ అమలు చేయాలని, విద్యార్థులకు దుప్పట్లు, పరుపులు అందజేయాల న్నారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ఈనెల 10న నిర్వహించే విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు జిట్ట గౌతం, మండల నాయకులు జిట్ట మహావీర్, చందు తదితరులు పాల్గొన్నారు.